క్లుప్తంగా

సన్మానం



సంగెం : రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ గీసుకొండ మండల నాయకులు సోమవారం సన్మానించారు. తొలుత పుష్పగుచ్చాలు అందజేసి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా నాయకుడు వీరగోని రాజ్‌కుమార్, పార్టీ సమన్వయకర్త అల్లం మల్లారెడ్డి, నాయకులు మాదాసి రాంబాబు, వేల్పుల సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీఓగా ఉమారాణి

నర్సంపేట : స్థానిక ఆర్డీఓగా ఉమారాణి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ పని చేసిన కృష్ణవేణి కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా)కు బదిలీ కాగా పౌర సరఫరాల శాఖలో పని చేసి ఉమారాణి ఇక్కడి ఆర్డీఓగా నియమితులయ్యారు.

విద్యుత్ ఏఈగా మంగమ్మ



ఖానాపురం : స్థానిక విద్యుత్ శాఖ ఏఈగా మంగమ్మ సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఏఈ సంపత్ నర్సంపేట డివిజన్ కార్యాలయానికి బదిలీ అయిన విషయం తెలిసిందే. మహబూబాబాద్ డివిజన్ కార్యాలయంలో పని చేస్తున్న మంగమ్మ ఇక్కడకు బదిలీ అయ్యారు. ఆమెకు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలి



దుగ్గొండి : మంచినీటి సహాయకులు సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని ఎంపీడీఓ లెక్కల అరుంధతి ఆకాంక్షించారు. మంచినీటి సరఫరా, లీకేజీలకు మరమ్మతు, తదితర అంశాలపై నాలుగు రోజుల శిక్షణ పూర్తి చేసుకున్న మంచినీటి సహాయకులకు స్థానిక కార్యాలయంలో సోమవారం ఆమె సర్టిఫికెట్లు అందజేసి మాట్లాడారు. ప్రజలకు పరిశుభ్రమైన నీటిని అందజేయడంలో ఎదురయ్యే సమస్యల పరిష్కారమే లక్ష్యంగా శిక్షణ ఇప్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీధర్‌గౌడ్, ఏఈ మంగ్యా, తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో వాహనాలు నడపొద్దు

నర్సంపేట రూరల్ : మద్యం మత్తులో వాహనాలు నడపొద్దని టౌన్ ఎస్సై రవికుమార్ కోరారు. మద్యం సేవించి వాహనం నడుపుతూ పోలీసులకు చిక్కిన మైసి సురేశ్‌ను నర్సంపేట కోర్టులో సోమవారం హాజరు పర్చగా సెకండ్ క్లాస్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కొత్త లక్ష్మీనారాయణ నిందితుడికి మూడ్రోజుల జైలు శిక్షతోపాటు వెయ్యి రూపాయల జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

అన్ని పత్రాలుంటేనే భూముల రిజిస్ట్రేషన్



నల్లబెల్లి : వ్యవసాయ భూములకు సంబంధించి సంబంధిత పత్రాలన్నీ ఉంటేనే స్లాట్ బుక్ చేసుకున్న వారికి ప్రభుత్వ నిబంధనల మేరకు రిజిస్ట్రేషన్ చేస్తామని తహసీల్దార్ ముప్పు కృష్ణ తేటతెల్లం చేశారు. తన కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు, ప్రజలు ఏవైనా భూసంబంధిత సమస్యలుంటే తనను నేరుగా సంప్రదించాలని సూచించారు. దళారులను, పైరవీకారులను ఆశ్రయించొద్దని కోరారు. రైతులు, ప్రజలు సరైన పత్రాలతో వచ్చి రెవెన్యూ సిబ్బందికి సహకరించాలని ఆకాంక్షించారు.

అనారోగ్యంతో ప్రభుత్వ ఉద్యోగి మృతి

చెన్నారావుపేట : అనారోగ్యంతో తహసీల్దార్ కార్యాలయ ఆఫీస్ సబార్డినేట్ కొరివి వెంకన్న (57) సోమవారం మృతి చెందాడు. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని అయోధ్యపురం గ్రామానికి చెందిన వెంకన్న తొమ్మిదేళ్ల తహసీల్దార్ కార్యాలయంలో నైట్ వాచ్‌మెన్‌గా పని చేసి నాలుగు నెలల క్రితమే ఆఫీస్ సబార్డినేట్‌గా ఉద్యోగోన్నతి పొందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు. వెంకన్న మృతదేహానికి తహసీల్దార్ ఫణికుమార్‌తోపాటు సిబ్బంది నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి అంత్యక్రియల కోసం రూ.20 వేలు అందజేశారు.

కుచించుకుపోతున్న ‘పెద్దమ్మకుంట’

● శిఖంలో కట్టడాలు.. అధికారుల నిర్లక్ష్యం

దుగ్గొండి : మండలంలోని లక్ష్మీపురం గ్రామంలోని పెద్దమ్మకుంట చెరువు నానాటికీ కుచించుకుపోతోంది. ఈ చెరువు ఊరికి జీవనాధారం. వర్షాలు కురిస్తే వరద నీరంతా చెరువులోకే చేరాలి. ప్రస్తుతం ఆనవాళ్లు లేకుండా పోతున్న దుస్థితి నెలకొంది. శిఖం భూమిలో అక్రమ నిర్మాణాలు చోటు చేసుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. లక్ష్మీపురంలోని పెద్దమ్మకుంట చెరువు శిఖం 13.07 ఎకరాలుగా గణాంకాలు చెబుతున్నాయి. చెరువు పరిధిలో 30 ఎకరాల ఆయకట్టు ఉంది. ఎలుకుర్తి–పొనకల్–లక్ష్మీపురం–నీరుకుళ్ల–బంధంపల్లి పల్లెల ప్రధాన రహదారిని ఆనుకుని చెరువు ఉంది. కొన్నేళ్లుగా చెరువు శిఖంలో అక్రమ నిర్మాణాలు జరుగుతుండడంతో చిన్న నీటి గుంటను తలపిస్తోంది. శిఖంలో సుమారు 50 మంది ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యగులే కాకుండా సంపన్నులు నిర్మాణాలు చేపట్టడం గమనార్హం. ఇదే అదనుగా గతేడాది కుల సంఘాల నేతలు ఆక్రమించి హద్దులు పెట్టుకున్నారు. దీంతో అధికారులు తాత్కాలికంగా హద్దులు తొలగించి చేతులు దులుపుకున్నారు. చెరువు ఆక్రమణకు గురవుతుండడంతో పొలాలకు నీరు అందక ఆయకట్టు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెరువు శిఖం అక్రమణకు గురవుతోందని సమాచారం ఇచ్చినా అధికారులు అధికారులు పట్టించుకోకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది.



పెద్దమ్మకుంట చెరువు శిఖంలోని అక్రమ నిర్మాణాలు

ఆక్రమణతో సాగునీటికి కటకట



పెద్దమ్మకుంట చెరువు ఆక్రమణతో పంటలకు సాగునీటికి కటకట తప్పడం లేదు. చెరువులో నీరు ఉండని దుస్థితి నెలకొంది. చెరువు కింద నాకున్న ఐదెకరాల పొలానికి నీరు అందడం లేదు. దీంతో పెద్ద చెరువు నుంచి ప్రత్యేకంగా కాల్వ తీసుకొచ్చి పొలాలు పారించుకుంటున్నాము. ఇకనైనా రెవెన్యూ, సాగునీటి, సంబంధిత ఇతర ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు స్పందించి చెరువు శిఖంలోని అక్రమ నిర్మాణాలు తొలగించాలి. తద్వారా చెరువును కాపాడాలి. ఆయకట్టు రైతుల కష్టాలు తీర్చాలి.

-వాడికారి ఆనందరావు, ఆయకట్టు రైతు

ఆదేశాలు రాగానే చర్యలు



లక్ష్మీపురంలోని పెద్దమ్మకుంట చెరువు శిఖం భూమిలో అక్రమ నిర్మాణాలు కొన్నేళ్లుగా జరుగుతున్నాయి. కులసంఘాలు గతేడాది ఆక్రమించి హద్దులు పెట్టుకోగా వాటిని తొలగించి తాత్కాలికంగా హద్దులు ఏర్పాటు చేశాము. పెద్దమ్మ చెరువు శిఖం సర్వే నంబర్ 5, 6ల్లోని ప్రభుత్వ భూమి విస్తీర్ణం, అక్రమ నిర్మాణాలు, ఇతర వివరాలపై సర్వే చేశాము. ప్రత్యేక నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి, ఉన్నతాధికారులకు పంపించాము. ప్రభుత్వ ఆదేశాలు రాగానే చర్యలు తీసుకుంటాము.

-రవిచంద్రారెడ్డి, తహసీల్దార్

రక్తదానం సామాజిక బాధ్యత

● వరంగల్ ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్

నర్సంపేట : రక్తదానం చేయడాన్ని సామాజిక బాధ్యతగా వరంగల్ ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్ అభివర్ణించారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నర్సంపేట డివిజన్ పోలీస్ ఆధ్వర్యంలో పట్టణంలోని సిటిజన్స్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి ఆయన హాజరై మాట్లాడారు. సమాజంలోని ఆరోగ్యవంతులైన ప్రతిఒక్కరూ ఆర్నెళ్లకోసారి రక్తదానం చేయొచ్చని చెప్పారు. రక్తదానం పట్ల అపోహలు వీడాలని, అవగాహన పెంచుకుని చైతన్యవంతం కావాలని సూచించారు. పలువురు యువకులు రక్తదానానికి ముందుకు రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. యువత రక్తదానం చేసి ఇతరులకు స్ఫూర్తినివ్వాలని సూచించారు. పట్టణానికి చెందిన ఏఎస్ఆర్ సేవా స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు ఎర్రబోయిన రాజశేఖర్ 26వ సారి రక్తదానం చేయగా ఆయన్ను ఏసీపీ కిరణ్‌కుమార్‌తో కలిసి డీసీపీ రవీందర్ సర్టిఫికెట్ అందజేసి అభినందించారు. కార్యక్రమంలో సీఐలు రమణమూర్తి, చంద్రమోహన్, సాయిరాం, ఎస్సైలు రవికుమార్, మహేందర్, రాజేశ్, వెంకటేశ్వర్లు, రఘుపతి, తదితరులు పాల్గొన్నారు.



రాజశేఖర్‌కు సర్టిఫికెట్ అందజేస్తున్న డీసీపీ, ఏసీపీ

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



చెన్నారావుపేట: వినతిపత్రం ఇస్తున్న నాయకులు

చెన్నారావుపేట/పర్వతగిరి/సంగెం : ఉద్యోగుల, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని టీపీయూఎస్ నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ సంఘం ఆధ్వర్యంలో నాయకులు చెన్నారావుపేట, పర్వతగిరి, సంగెం మండలాల్లో తహసీల్దార్లకు సోమవారం వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తిని వెంకటరమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి సతీశ్, జిల్లా గౌరవ అధ్యక్షుడు బాలాజీరావు, పర్వతగిరి, సంగెం మండలాల అధ్యక్షులు ఆనంద్ మోహన్, ప్రసాద్ మాట్లాడారు. ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు 5 డీఏలు ప్రకటించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నవంబర్ 5న జిల్లా కలెక్టరేట్ వద్ద, అదే నెల 23న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద తలపెట్టిన ఉపాధ్యాయ ధర్మాగ్రహ దీక్షల్లో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమాల్లో నాయకులు రామకృష్ణ, జూలపల్లి విజయభాస్కర్ రావు, రాజేశ్, రవి, తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీ ఏర్పాటులో నిర్లక్ష్యం తగదు



సమావేశంలో మాట్లాడుతున్న సూరయ్య

నెక్కొండ : మండల కేంద్రంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం తగదని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సంగని సూరయ్య, పీఏసీఎస్ చైర్మన్ మారం రాము అన్నారు. స్థానిక ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌజ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రజారోగ్య పరిరక్షణలో నిర్లక్ష్యం చోటు చేసుకుంటోందని ఆందోళన వెలిబుచ్చారు. బీఆర్ఎస్ హయాంలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ముందు చూపుతో నర్సంపేటలో హెల్త్ హబ్ చేయించడంతో నియోజకవర్గ కేంద్రంలో మెడికల్, నర్సింగ్ కళాశాలలతోపాటు జిల్లా ఆస్పత్రి నెలకొన్నాయని చెప్పారు. మండలంలో గిరిజన జనాభా ఎక్కువగా ఉన్న నేపథ్యంలో స్థానిక పీహెచ్‌సీని సీహెచ్‌సీగా ఉన్నతీకరించేందుకు నాడు మంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లినట్లు గుర్తు చేశారు. సీహెచ్‌సీ ఏర్పాటు చేస్తే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందడంతోపాటు పోస్టుమార్టం సైతం ఉంటుందని తెలిపారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చొరవ చూపాలని, పీహెచ్‌సీని సీహెచ్‌సీగా అప్‌గ్రేడేషన్ చేయించాలని కోరారు. సమావేశంలో ఆ పార్టీ సీనియర్ నాయకులు కొమ్ము రమేశ్‌యాదవ్, గాదె భద్రయ్య, గుంటుక సోమయ్య, లావుడ్యా హరికిషన్, జాటోతు రమేశ్‌నాయక్, శివకుమార్, బొల్లె బోయిన వీరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్



భగీరథ నీరు రోడ్డు పాలు

మండల కేంద్ర శివారులో పైపులైన్‌కు లీకేజీ ఏర్పడడంతో మిషన్ భగీరథ నీరు రోడ్డుపాలవుతోంది. రోజుల తరబడిగా నీరు వృథాపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి పైపులైన్‌కు మరమ్మతులు చేయించి నీటి వృథా అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు. -ఖానాపురం

ప్రశ్నించాల్సిన అధికారి పేరు :
శిరీశ, ఏఈ, మిషన్ భగీరథ
ఫోన్‌నంబర్ : 7032293977

‘ఎల్‌ఆర్‌ఎస్’లో సమన్వయం కీలకం

దుగ్గొండి : ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎల్‌ఆర్‌ఎస్) దరఖాస్తుల పరిష్కారంలో ఇరిగేషన్, రెవెన్యూ, ఇతర ప్రభుత్వ శాఖల అధికారుల నడుమ సమన్వయం కీలకమని ఎంపీడీఓ అరుంధతి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన శిక్షణా శిబిరంలో ఆమె మాట్లాడారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో 2020 సంవత్సరంలో 1,414 మంది ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. గ్రామాల వారీగా దరఖాస్తుల వివరాలను వెల్లడించారు. సర్వేలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఇరిగేషన్ ఏఈ, రెవెన్యూ అధికారి, పంచాయతీ కార్యదర్శి సంయుక్తంగా ప్లాట్లను పరిశీలించి వివరాలను సరిపోల్చుకున్నాక రెగ్యులరైజేషన్‌కు ఆమోదం తెలియజేయాలని స్పష్టం చేశారు. తొలుత చాపలబండలో సర్వే చేపడతామన్నారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి రాజు యాప్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీధర్, ఇరిగేషన్ ఏఈ సుష్మ, ఆర్ఐ మల్లయ్య, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న పంచాయతీ కార్యదర్శి రాజు

అదృశ్యమైన బాలుడి ఆచూకీ లభ్యం

వర్ధన్నపేట : అదృశ్యమైన బాలుడి ఆచూకీ లభించింది. వివరాలిలా.. మండలంలోని దమ్మన్నపేటకు చెందిన చొప్పరి శ్రీరామ్ 9వ తరగతి చదువుతున్నాడు. ఈనెల 25న తల్లి మందలించడంతో మధ్యాహ్న భోజనం అనంతరం ఇంటికి వచ్చి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బంధువుల, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనెల 27న శ్రీరామ్ తిరుపతిలో అనుమానాస్పద స్థితిలో తిరుగుతుండగా పోలీసులు పట్టుకుని స్థానిక పోలీసుల ద్వారా సమాచారం అందించి శ్రీరామ్‌ను తల్లిదండ్రులకు అప్పగించారు.

పోరాటాలతోనే ప్రజాసమస్యల పరిష్కారం

● సీపీఎం జిల్లా కార్యదర్శి రంగయ్య

నర్సంపేట : ఐక్యపోరాటాలతోనే ప్రజాసమస్యలు పరిష్కారమవుతాయని సీపీఎం జిల్లా కార్యదర్శి చింతమల్ల రంగయ్య స్పష్టం చేశారు. పట్టణంలోని ఐఎంఏ హాలులో ఆ పార్టీ పట్టణ కమిటీ సభ్యుడు గడ్డమీది బాలకృష్ణ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన పట్టణ కమిటీ మహాసభలకు రంగయ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం మతోన్మాదంతో ప్రజల్లో విద్వేశాలు సృష్టిస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలో రైతు రుణమాఫీ అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. మహాసభలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈసంపెల్లి బాబు, భూక్యా సమ్మయ్య, కోరబోయిన కుమారస్వామి, పట్టణ కార్యదర్శి హన్మకొండ శ్రీధర్, పట్టణ కమిటీ సభ్యులు కందికొండ రాజు, శాఖ కార్యదర్శులు ఫరీదా, బిట్ర స్వప్న, విజయ తదితరులు పాల్గొన్నారు.



నర్సంపేట : సభలో మాట్లాడుతున్న రంగయ్య

చెన్నారావుపేట : మండలంలోని పాపయ్యపేటలో నిర్వహించిన సీపీఎం శాఖ మహాసభలో ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఈసంపెల్లి బాబు మాట్లాడారు. సభలో మండల శాఖ కార్యదర్శి నమిండ్ల స్వామి, పర్వతగిరి శాఖ బాధ్యుడు యాకూబ్, నాయకులు శారద, సమ్మయ్య, మధుకర్, తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ సాధనే లక్ష్యంగా ఉద్యమాలు



సమావేశంలో మాట్లాడుతున్న రవీందర్

వర్ధన్నపేట : ఎస్సీ వర్గీకరణ సాధనే లక్ష్యంగా ఉద్యమాలు నిర్మించనున్నట్లు మాదిగ జేఏసీ నాయకుడు మిద్దెపాక రవీందర్ తెలిపారు. పట్టణంలో సోమవారం నిర్వహించిన జేఏసీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి దేశంలో తొలి వ్యక్తిగా స్పందించి సానుకూలంగా హామీ ఇచ్చారని తెలిపారు. నెలలు గడుస్తున్నా అమలు చేయకుండా మోసపూరితంగా కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. నవంబర్ 4న తలపెట్టిన ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు తూళ్ల కుమారస్వామి, జన్ను రాములు, జన్ను నర్సయ్య, వల్లందాసు కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం



వైద్యపరీక్షలు చేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ దయాకుమారి

చెన్నారావుపేట : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ ఆరోగ్యాన్ని రక్షించుకోవాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యురాలు సరోజన తెలిపారు. మండలంలోని పాత ముగ్దుంపురంలో సోమవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరంలో ఆమె స్థానికులను ఉద్దేశించి మాట్లాడారు. సమాజంలోని ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు. తద్వారా సీజనల్ వ్యాధుల నుంచి రక్షించుకోవచ్చని చెప్పారు. తొలుత పలువురికి వైద్యపరీక్షలు నిర్వహించారు. పలువురి నుంచి రక్తనమూనాలు సేకరించారు. మందులు పంపిణీ చేశారు. అలాగే గ్రామంలో దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ భద్రయ్య, హెల్త్ సూపర్‌వైజర్ రామెల్, వైద్య సిబ్బంది దయాకుమారి, సురేందర్, సరియా, పుష్ప, ఆశ కార్యకర్తలు వసుమతి, శ్రీలత, జీపీ సిబ్బంది సాంబయ్య, నాంపెల్లి కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.

నిర్దేశిత తేమతో గిట్టుబాటు ధర



తేమ శాతాన్ని పరిశీలిస్తున్న ఏఈఓ మనస్విని

రాయపర్తి : ప్రభుత్వం నిర్దేశించిన తేమ శాతాన్ని పాటిస్తే రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర ఖచ్చితంగా లభిస్తుందని ఏఈఓ మనస్విని స్పష్టం చేశారు. మండలంలోని కాట్రపల్లిలో గాంధీ గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆమె సందర్శించారు. ధాన్యం నాణ్యత, తేమ శాతాన్ని పరిశీలించి మాట్లాడారు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి 14 శాతానికి తేమ మించకుండా కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చి మద్దతు ధర పొందాలన్నారు. లాభాపేక్ష లేకుండా కొనుగోలు కేంద్రాలు నిర్వహిస్తున్న మహిళా సంఘాలకు సహకరించాలని కోరారు.

హామీలు నెరవేర్చాలి

నర్సంపేట రూరల్/ఖానాపురం: కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని లఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం డివిజన్ అధ్యక్షుడు గట్టికొప్పుల రవి, డివిజన్ కార్యదర్శి కత్తుల కొమురయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు వారి ఆధ్వర్యంలో సంబంధిత తహసీల్దార్లను సోమవారం వినతిపత్రాలు అందజేశారు. అనంతరం రవి, కొమురయ్య మాట్లాడారు. వరి పంటకు బోనస్ ఇవ్వాలని, రుణమాఫీని పూర్తిస్థాయిలో అమలు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ఆధ్వర్యంలో పంట ఉత్పత్తులు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ధార లింగన్న, జవహర్‌లాల్, మనోహరా చారీ, సుధాకర్, కట్టన్న, నరేశ్, వెంకన్న, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థిని వైద్యవిద్యకు తోడ్పాటు

నర్సంపేట : పట్టణానికి చెందిన ఉద్యమకారుడు, సామాజికవేత్త కల్లెపల్లి ప్రణయ్‌దీప్ కూతురు ఉద్యమ కరుణదీప్ వైద్య విద్య అభ్యసించేలా మాతృభూమి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ మోహన్‌రావు–వినోద దంపతులు సోమవారం రూ.40 వేల డీడీ అందజేశారు. అనంతరం మోహన్‌రావు మాట్లాడారు. పేద బాలికల ఉన్నత చదువుకు పేదరికం అడ్డు కాకూడదని ఆకాంక్షించారు. ఉద్యమ కరుణదీప్ సూర్యాపేటలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ అడ్మిషన్ పొందగా మొదటి సంవత్సరం ఫీజు డీడీ అందజేసినట్లు తెలిపారు. వైద్యవిద్య పూర్తయ్యే వరకు ఐదేళ్లపాటు ఆర్థిక సాయం అందజేస్తామని భరోసా ఇచ్చారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

నల్లబెల్లి : మండల కేంద్రానికి చెందిన మేరుగుర్తి ఎల్లస్వామికి మంజూరైన రూ.30 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తిని మహేశ్ సోమవారం అందజేశారు. అనంతరం మహేశ్ మాట్లాడారు. ఎల్లస్వామి పక్షవాతం బారిన పడి ఆస్పత్రిలో వైద్యం చేయించుకోగా సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ.30 వేలు మంజూరు చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకుడు పరికి పవన్, తదితరులు పాల్గొన్నారు.

క్షేత్ర సందర్శనతో అవగాహన పెంపు

పర్వతగిరి : క్షేత్ర సందర్శనతో విద్యార్థుల్లో అవగాహన పెరుగుతుందని స్థానిక మండల ప్రజాపరిషత్ స్కూల్ హెచ్‌ఎం వెంకటరమణారెడ్డి తెలిపారు. ఆ స్కూల్ విద్యార్థులు మండల కేంద్రంలోని పర్వతాల శివాలయానికి సోమవారం క్షేత్ర సందర్శన కోసం వెళ్లారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆలయ చరిత్రను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు వివరించారు. అనంతరం హెచ్‌ఎం మాట్లాడారు. పాఠ్యాంశాల్లో చదువుకున్న విషయాలను నిజజీవితంలో అన్వయించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుభాషిణి, లలిత, నవీన్, కిషన్, తదితరులు పాల్గొన్నారు.

‘ఎస్ఆర్ఆర్’ ఔదార్యం

రాయపర్తి : మండలంలోని మైలారం గ్రామానికి చెందిన కోరం రజిత రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు విరిగి హైదరాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకుంటుండగా ఆమెకు వైద్యం కోసం ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ అధినేత పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి సోమవారం రూ.21 వేల సాయం అందజేసి ఔదార్యం చాటుకున్నారు. మైలారం ప్రజలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

నియామకం

నర్సంపేట : పట్టణానికి చెందిన గందు రవి జాతీయ బీసీ సంక్షేమ సంఘం పట్టణ కన్వీనర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు రవికి సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు బట్టు శ్యామ్ యాదవ్, జిల్లా ఇన్‌చార్జ్ సోల్తి సారయ్య సోమవారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడారు. బీసీల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తానని చెప్పారు. సంఘాన్ని పట్టణంలో విస్తరింపజేసే దిశగా చొరవ తీసుకుంటానని తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నీలారపు నరేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి సోల్తి రవి, డివిజన్ ప్రధాన కార్యదర్శి సాంబరాతి మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

టఫ్ డివిజన్ ప్రధాన కార్యదర్శిగా సురేశ్

చెన్నారావుపేట : తెలంగాణ ఉద్యమకారుల ఫోరం (టఫ్) నర్సంపేట డివిజన్ ప్రధాన కార్యదర్శిగా మండలంలోని లింగాపురం గ్రామానికి చెందిన నమిండ్ల సురేశ్‌ను నియమించారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్, రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు జ్యోతిరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాంబరావు, జిల్లా అధ్యక్షుడు నందగిరి రజినీకాంత్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో విలేకరులతో సురేశ్ మాట్లాడారు. ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి పాటుపడతానని చెప్పారు.

మండల కార్యదర్శిగా..

వర్ధన్నపేట : పట్టణానికి చెందిన మాడిశెట్టి లక్ష్మణ్‌ను తెలంగాణ ఉద్యకారుల ఫోరమ్ (టఫ్) మండల కార్యదర్శిగా నియమించినట్లు చైర్మన్ చీమ శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మీడియాతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమించిన వారిని ప్రభుత్వం గుర్తించాలని ఆకాంక్షించారు. ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి, ఫోరం బలోపేతానికి పాటుపడతానని చెప్పారు.

బీఎస్ఎస్ కార్యవర్గం ఎన్నిక

రాయపర్తి : మండల కేంద్రంలో భవన నిర్మాణ సంఘం (బీఎస్ఎస్) గ్రామ కార్యవర్గాన్ని మండల అధ్యక్షుడు బాల్లెం యాదగిరి ఆధ్వర్యంలో సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బొమ్మరబోయిన అశోక్, ఐత కుమార్, ఉపాధ్యక్షుడుగా పీరని వెంకన్న, కోశాధికారిగా హుస్సేన్, సహాయ కార్యదర్శిగా మచ్చ భాస్కర్, ప్రచార కార్యదర్శిగా కోటి, కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు యాదగిరి మాట్లాడారు. భవన నిర్మాణ రంగంలో పని చేస్తున్న కార్మికుల సంక్షేమం, సమస్యల పరిష్కారం, హక్కుల సాధనే లక్ష్యంగా కార్యవర్గం పని చేస్తుందని తెలిపారు.

పీఎంఈజీపీ రుణం ఇవ్వడం లేదు

వర్ధన్నపేట : తనకు పీఎంఈజీపీ రుణం మంజూరైనా బ్యాంకు మేనేజర్ ఇవ్వడం లేదంటూ మండలంలోని నల్లబెల్లికి చెందిన బల్ల కుమారస్వామి జిల్లా కలెక్టర్‌కు ప్రజావాణిలో సోమవారం ఫిర్యాదు చేశాడు. అనంతరం ఆయన వివరాలు వెల్లడించారు. తనకు రుణం మంజూరై బ్యాంకు లింక్ ద్వారా ఇవ్వాలని ఆదేశాలు అందినా ఏపీజీవీ బ్యాంకు ఇల్లంద శాఖ మేనేజర్ మంజూరు చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. తనకు రుణం ఇప్పించి న్యాయం చేయాలని కోరాడు.

ఆర్థికసాయం

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండల విద్యావనరుల కార్యాలయంలో ఎంఐఎస్ కోఆర్డినేటర్‌గా అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికపై పని చేస్తున్న సంగెపు భరత్‌కుమార్‌కు అతడి తండ్రి సారంగపాణి ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో డీటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం రూ.23 వేల సాయం అందజేశారు. కార్యక్రమంలో ఫెడరేషన్ మండల అధ్యక్షుడు సర్దార్, జిల్లా ఉపాధ్యక్షుడు దార్ల రవీందర్, జిల్లా కార్యదర్శి కొమ్మాలు, నాయకులు కొర్ర రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

చాపలబండలో..

దుగ్గొండి : మండలంలోని చాపలబండకు చెందిన రెడ్డి సంఘం సభ్యుడు రేవూరి జనార్దన్‌రెడ్డి వారం రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందగా బాధిత కుటుంబానికి ఆ సంఘం అధ్యక్షుడు గుడిపెల్లి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం రూ.5 వేల సాయం అందజేశారు. తొలుత జనార్దన్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు ఆరె వీరారెడ్డి, తోకల ఆదిరెడ్డి, తిరుపతిరెడ్డి, అశోక్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నివాళి

చెన్నారావుపేట : మండలంలోని ఉప్పరపల్లికి చెందిన చీరబోయిన అజేందర్ (35) సోమవారం గుండె పోటుతో మృతి చెందగా ఆయన మృతదేహానికి మెపా వ్యవస్థాపక అధ్యక్షుడు పులి దేవేందర్ సోమవారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. కార్యక్రమంలో ముదిరాజ్ కుల పెద్దలు చీరబోయిన భిక్షపతి, చెలకలపెల్లి వీరస్వామి, పులి చేరాలు, కొక్కు లింగయ్య, ఐలయ్య పాల్గొన్నారు.

పరామర్శ

పర్వతగిరి : మండలంలోని కొంకపాకకు చెందిన వర్కాల యాకయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను నర్సయ్య, ఆర్ఎస్‌పీ జిల్లా కార్యదర్శి వల్లందాస్ కుమార్ సోమవారం పరామర్శించారు. తొలుత మృతుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, బొక్కల ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.